
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

3★★★

గురువారం 18 జనవరి 2024

వైభవం.. రామలింగేశ్వరుడి రథోత్సవం
- తరలివచ్చిన భక్తులు - 6లో..

ప్రజా సంక్షేమమే
కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం - 6లో..



బినామీలు చిక్కేనా?

- బినామీ రేషన్ డీలర్ల ఏరివేతకు కసరత్తు
- ఈ నెల 20 వరకు తనిఖీలు
- 31న ఉన్నతాధికారులకు నివేదిక
- జిల్లాలో 345 రేషన్‌దుకాణాలు
- 50 ఖాళీలు.. లెక్క తేలితే పెరిగే అవకాశం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పేదలకు ఆహార భద్రతను అందిస్తున్న రేషన్ దుకాణాలపై దశాబ్దాల కాలంగా సరైన పర్యవేక్షణ లేదనే విమర్శలు ఉన్నాయి. బినామీ రేషన్ డీలర్లు కొనసాగుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అధికారుల అండదండలతోనే బినామీ డీలర్లుగా కొనసాగుతున్నారనే ప్రచారమూ ఉంది. ఈ నేపథ్యంలోనే బినామీ రేషన్ డీలర్ల ఏరివేతకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 20 వరకు చౌకధరల దుకాణాల తనిఖీ ప్రక్రియను చేపట్టారు. తనిఖీలు పూర్తి చేసి ఈ నెల 31న ఉన్నతాధికారులకు నివేదికలు అందించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో బినామీ రేషన్ డీలర్లు తనిఖీల్లో చిక్కుతారా? అనే అనుమానాలను లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు. అసలైన డీలర్లు కొందరు వివిధ కారణాలతో రేషన్ దుకాణాలను కొనసాగించకపోవడం, కొందరు డీలర్లు చనిపోగా వారి వారసులు అద్దె ప్రాతిపదికన ఇతరులకు అప్పగించినవి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం చేపట్టిన రేషన్ డీలర్ల సర్వే ఫలితాలు ఎలా ఉండబోతున్నాయనే ఆసక్తి నెలకొనగా బినామీ డీలర్లు కేసుల్లో ఇరుక్కుంటామేమోనని భయపడుతున్నారు.

మండలం	రేషన్‌షాపులు	కార్డులు	లబ్ధిదారులు	బియ్యం
బోయినపల్లి	25	11,905	32,768	2,10,384
చందుర్తి	19	10,963	29,870	1,86,662
గంభీరావుపేట	29	14,404	40,922	2,58,700
ఇల్లంతకుంట	33	15,553	42,573	2,69,641
కోనరావుపేట	35	13,919	40,243	2,54,950
ముస్తాబాద్	29	14,385	41,900	2,65,833
రుద్రంగి	08	4846	14,662	92,280
సిరిసిల్ల	49	26,833	79,499	5,93,267
తంగళ్లపల్లి	34	14,099	40,280	2,65,711
వీర్నపల్లి	09	4205	12,826	80,791
వేములవాడ	30	19,568	56,993	3,58,768
వేములవాడ రూరల్	16	7440	10,885	1,30,127
ఎల్లారెడ్డిపేట	29	15,648	44,284	2,78,791
మొత్తం	**345**	**1,73,768**	**4,97,566**	**32,45,905**

● జిల్లాలో 50 రేషన్ డీలర్ల ఖాళీలు

జిల్లాలో 345 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. వీటిలో 50 రేషన్ డీలర్ల ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కొనసాగుతున్న రేషన్ డీలర్ల బినామీ లెక్క తేలితే మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి. జిల్లాలో ఎన్ని ఇన్‌చార్జి డీలర్లతో నడుస్తున్నాయో? లెక్క తేలాల్సి ఉంది. ఖాళీ రేషన్ దుకాణాలతోపాటు బినామీల రేషన్ దుకాణాలు రద్దు చేస్తే కొత్త డీలర్లకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. జిల్లాలో బినామీలతో నడుస్తున్న రేషన్ దుకాణాలను అధికారులు పారదర్శకంగా గుర్తిస్తారా? ఒత్తిళ్లకు తలొగ్గుతారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు మాత్రం తనిఖీలు పారదర్శకంగా ఉంటాయని స్పష్టం చేస్తున్నారు.

● జోరుగా బియ్యం అక్రమ దందా

జిల్లాలోని 12 మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో 345 రేషన్ దుకాణాలు, వీటి పరిధిలో 1,73,768 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 13,685, ఆహార భద్రత కార్డులు 1,59,876, అన్నపూర్ణ కార్డులు 207 ఉన్నాయి. వీటి పరిధిలో 4,97,566 మంది లబ్ధిదారులు ఉండగా వీరికి ప్రతి నెలా 32,45,905 కిలోల బియ్యాన్ని కేటాయించి పంపిణీ చేస్తున్నారు. ఈ పాస్ బయోమెట్రిక్ విధానం ఉన్నప్పటికీ రేషన్ డీలర్లే నేరుగా లబ్ధిదారుల వద్ద బియ్యాన్ని సేకరించి తిరిగి మిల్లర్లకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల నిఘా లేకపోవడంతో రేషన్ బియ్యం రీ సైక్లింగ్ జరుగుతోందని తెలుస్తోంది. బినామీ రేషన్ డీలర్ల తనిఖీలతో పాటు అక్రమదందాపై కూడా ప్రభుత్వం దృష్టి పెడుతుందని భావిస్తున్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్ల 52 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వేములవాడ, జనవరి 17: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా రూ.2కోట్ల 52 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. గత 21 రోజుల హుండీ ఆదాయాన్ని ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్ల మధ్య బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా 2 కోట్ల, 52 లక్షల, 29 వేల, 580 రూపాయల నగదు, 277 గ్రాముల, 100 మిల్లి గ్రాముల బంగారం, 13 కిలోల, 280 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.కృష్ణప్రసాద్, అధికారులు, సిబ్బంది, శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

అవగాహన సదస్సులు నిర్వహించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 17 : నాబార్డు సౌజన్యంతో చేపట్టే జీవనోపాధుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి చూపే నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాలను గుర్తించేందుకు జిల్లాలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో అవగాహన సదస్సులను నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం నాబార్డు సౌజన్యంతో చేపట్టే జీవనోపాధుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై నాబార్డు, గ్రామీణాభివృద్ధి సంస్థల అధికారులతో బుధవారం సమీక్షించారు. నాబార్డు సౌజన్యంతో ఇచ్చే శిక్షణ కార్యక్రమం ఎన్‌రోల్ చేసుకున్న అభ్యర్థులకు శిక్షణతోపాటు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్, స్టైఫండ్, వసతి సౌకర్యంపై వివరించాలన్నారు. శిక్షణ పొందిన తర్వాత ఉమ్మడిగా సంఘాలు లేదా అభ్యర్థులు రూరల్ మార్ట్ పేరుతో యూనిట్‌లు పెట్టుకుంటే నాబార్డు నుంచి రూ.5లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. అవగాహన సదస్సుల నిర్వహణ కార్యక్రమాల ప్లానింగ్‌ను మానిటరింగ్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, నాబార్డు జిల్లా అధికారి మనోహర్‌రెడ్డి, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్ పాల్గొన్నారు.

జిల్లా అధికారుల అసోసియేషన్ ఎన్నిక



కలెక్టర్‌ను కలిసిన నూతన కార్యవర్గం

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 17: జిల్లా అధికారుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ (డోర్స్) జిల్లా ఫౌండర్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఉండగా జిల్లా అధ్యక్షుడిగా జిల్లా రవాణా అధికారి వై.కొండల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్, కోశాధికారిగా పీబీ శ్రీనివాసచారి, ప్రచార కార్యదర్శులుగా మామిండ్ల దశరథం, భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీరాజం, నక్క శ్రీనివాస్, మదన్‌మోహన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని కలెక్టర్ అభినందించారు.

నేడు వాహనాలకు వేలం

ఎల్లారెడ్డిపేట, జనవరి 17: ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు మండల కేంద్రంలోని కార్యాలయం ఆవరణలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరీ ఆధ్వర్యంలో గురువారం వేలం పాటలు నిర్వహించనున్నామని ఆ శాఖ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలకు వేలం వేయనున్నామని పేర్కొన్నారు. వేలం పాటల్లో పాల్గొనే వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 50 శాతం డబ్బులను ముందుగా చెల్లించాలని సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు.

రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ



అన్నపూర్ణ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, జనవరి 17: రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని సర్జిపూల్, అన్నపూర్ణ రిజర్వాయర్, కెనాల్స్‌ను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పై నమ్మకంతో ప్రజలు అధికారాన్ని అప్పగించారన్నారు. పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటిని అమలు చేశామని, మిగతా వాటిని వంద రోజుల్లో అమలు చేస్తామని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికారం కోల్పోవడాన్ని తట్టుకోవడం లేదన్నారు. రైతులకు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. గతంలో రుణమాఫీ, ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఎఫ్‌బీఐ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు పెద్దబాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జనవరి 17 : కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం వట్టిమల్లలో జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డితో కలిసి బుధవారం పల్లె దవాఖానాను ప్రారంభించారు. పలు కుల సంఘాల భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముందుగా ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆది శ్రీనివాస్ మొట్టమొదటిసారిగా వట్టిమల్లకు రావడంతో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అనుమానాలకు తావు లేకుండా నెరవేరుస్తుం దన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీని రూ.10 లక్షల వరకు పెంచామన్నారు. వట్టిమల్ల గ్రామానికి పల్లె బస్సు నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే మూలవాగుపై కాజ్‌వేలను నిర్మించామన్నారు. అవి ప్రస్తుతం వరద తాకిడికి కొట్టుకుపోయాయన్నారు. ఇప్పుడు కూడా వాటి నిర్మాణం చేపడతామన్నారు. ప్రస్తుతం రూ.14 కోట్లతో మట్టిమల్ల, నిమ్మపల్లి కాజ్‌వేకు నిధులు మంజూరు చేశామన్నారు. మరో రూ.50 కోట్లతో బావుసాయిపేట, వెంకట్రావుపేట, మామిడిపల్లి, నిజామాబాద్ మూలవాగుపై కాజ్‌వే నిర్మాణం చేపడతామన్నారు. మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మీ పథకం ద్వారా బస్సులు సరిపోవడం లేదని, మరో కొన్ని కొత్త బస్సులు తెప్పిస్తామని అన్నారు. ఈ పథకాన్ని మహిళలు ఎక్కువ శాతం సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. వట్టిమల్ల పెట్టివాగు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. గిరిజనులకు పోడు భూములు పట్టాలు ఇచ్చే ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు శాఖలతో సమావేశం ఏర్పాటు చేశారని, మరికొన్ని శాఖలతో సమావేశం ఏర్పాటు చేసి ఒక అవగాహన వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. ప్రస్తుతం వట్టిమల్ల గ్రామస్థుల సూచన మేరకు తాగునీటి కోసం బోరు మంజూరు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ చంద్ర గౌడ్, వైద్యాధికారి మదన్మోహన్, సర్పంచ్ కొమ్ము స్వప్న దేవరాజు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, ప్రజాప్రతినిధులు పుంగమ్ గౌడ్, కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, ఫిరోజ్ పాషా, తాళ్లపెల్లి ప్రభాకర్, సత్యం, రుక్మిణి, నరేష్, వైద్య సిబ్బంది, బాలచందర్, ఉమాదేవి, శ్రీదేవి, రషీద్, తిరుమల, జ్యోతి, శారద, పద్మ, రేణుక, రజిత, కమలమ్మ, కళావతి పాల్గొన్నారు.



పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సీఎంఆర్ బియ్యాన్ని 15 రోజుల్లో డెలివరీ చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 17: సీఎంఆర్ బియ్యాన్ని 15 రోజుల్లో డెలివరీ చేయాలని, తహసీల్దార్‌లు నిత్యం మానిటరింగ్ చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం తహసీల్దార్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎంఆర్ బియ్యం డెలివరీతోపాటు భూములకు సంబంధించిన ఫిర్యాదులు, ఓటు నమోదు దరఖాస్తుల పరిష్కారం సహా పలు అంశాలపై చర్చించారు. జిల్లాలోని రైస్ మిల్లు పని చేసేలా మానిటరింగ్ చేయాలన్నారు. సీఎంఆర్ బియ్యం టార్గెట్ నిర్దేశించుకొని పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేక దృష్టి పెట్టి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతరం ధరణి, ఇతర భూములకు సంబంధించిన సమస్యలపై సమీక్షించారు. హైకోర్టు, ఇతర ఉన్నత న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నకేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కోర్టు ఆర్డర్‌ల ప్రకారం టైమ్‌లైన్‌లో అర్జీలను పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్‌లు భూములకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారాలను వారంలోగా పూర్తి చేయాలన్నారు. మ్యూటేషన్, సక్షేషన్ మినహా మిగతా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండవద్దన్నారు. మీసేవా సర్వీసెస్‌లో పెండింగ్‌పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కుల, ఆదాయ సర్టిఫికెట్‌లను పెండింగ్ లేకుండా రోజువారిగా క్లియర్ చేయాలన్నారు. మీ సేవలో పెండింగ్ దరఖాస్తులను మిషన్ మోడ్‌లో పరిష్కారించాలని ఆదేశించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఫారం 6,7, 8 దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ధరణి పెండింగ్ అర్జీలను వచ్చే శనివారంలోగా పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్‌ఎస్‌కు లేదు

ఇల్లంతకుంట, జనవరి 17: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్‌ఎస్‌కు లేదని, ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజలే ప్రభుత్వాన్ని కూలుస్తారని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ బండి సంజయ్ చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు. ప్రజలు తమకు బలమైన ప్రతిపక్ష హోదా ఇచ్చారని, అందుకు అనుగుణంగా పనిచేస్తామని అన్నారు. అబద్దాల పునాదుల మీద ఏర్పడిన ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తున్నామన్నారు. వంద రోజుల అనంతరం ప్రజల తరఫున ఉద్యమాలు చేపడుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఆడుతున్న ఆటలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతోనే రైతులకు మేలు జరిగిందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, సెస్‌డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, నాయకులు జక్కుల నాగరాజు, చిట్టి కృష్ణారెడ్డి, సాదుల్, సలీం, పెద్ది రాజు, సుధాకర్‌రెడ్డి, అనీల్‌కుమార్, మామిడి తిరుపతి, భాస్కర్, దొంతుల శంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

10 మంది ఎస్సైలకు స్థానచలనం

సిరిసిల్ల క్రైం, జనవరి 17: జిల్లాలో 10 మంది ఎస్సైలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ అఖిల్ మహజన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని వివిధ మం డలాలకు పలువురు ఎస్సైలకు పోస్టింగ్ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా వ్యాప్తంగా పలువురు ఎస్సైలను బదిలీ చేయడం స్థానికంగా చర్చ నీయాంశమైంది. ఎస్బీలో ఉన్న శ్రీకాంత్‌ను బోయినిపల్లికి,

	పేరు	ప్రస్తుత స్థానం	కేటాయించిన స్థానం
1.	ఎల్. శ్రీకాంత్	ఎస్‌బీ	బోయిన్‌పల్లి
2.	కె. ప్రశాంత్‌రెడ్డి	ఎస్‌బీ	తంగళ్లపల్లి
3.	జె. రమేశ్	వేములవాడ టౌన్	వీర్నపల్లి
4.	ఎస్. అశోక్	చందుర్తి	రుద్రంగి
5.	బి. రాంమ్మోహన్	సిద్దిపేట	గంభీరావుపేట
6.	వి. వెంకటేశ్వరు	తంగళ్లపల్లి	చందుర్తి
7.	ఎం. మహెందర్	బోయిన్‌పల్లి	జోన్=2
8.	కె. రాజేశ్	రుద్రంగి	జోన్=2
9.	డి. నవత	వీర్నపల్లి	ఎస్‌బీ
10.	బి. మహేశ్	గంభీరావుపేట	ఎస్‌బీ

కాంగ్రెస్ గెలుపు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి నిదర్శనం

- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం



ఆది శ్రీనివాస్, ప్రొఫెసర్ కోదండరాంను సన్మానిస్తున్న నాయకులు

వేములవాడ, జనవరి 17 : ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం గెలిచిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ప్రజల ఆత్మగౌరవానికి నిదర్శనమని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు బుధవారం వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లో పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తెలంగాణ ప్రజల విజయమని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పేర ఆరు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారని, తీరా చూస్తే రాష్ట్రం అంతటా సమస్యలు అలానే ఉన్నాయని అన్నారు. ఈ రోజు మొట్ట మొదటిసారి రాష్ట్రాన్ని ఏర్పరుచుకున్న రోజులాగా, రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు ఒక కొత్త ప్రయత్నం మొదలుపెట్టిన రోజులాగా కనబడుతోందన్నారు. ఆది శ్రీనివాస్‌కు పౌర సన్మానం అభినందనీయమని, ఎన్నికల ప్రచార సమయంలో ఆది శ్రీనివాస్ గెలుపు కోసం తాను కూడా ఒక చిరు కర్తవ్యం నిర్వహించానని అన్నారు. వేములవాడ ప్రాంతంలో బలమైన శక్తులను తట్టుకొని నిలబడటం గొప్ప విషయం అని, ప్రత్యర్థులు ఎన్ని రకాలుగా కుట్రలు చేసినా ఆది శ్రీనివాస్‌కు ప్రజలు పట్టం కట్టారన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను శాసనసభ్యుడిగా గెలిపించిన వేములవాడ ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేసిన ప్రొఫెసర్ కోదండరాం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావడం, ఆయన చేతుల మీదుగా సన్మానం పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో ప్రజా సమస్యలపై అలుపెరిగిన పోరాటం చేసిన వాడిగా ప్రతి సమస్యపై స్పష్టమైన అవగాహన ఉన్నవాడిగా ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉంటానన్నారు. వేములవాడ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా మన ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్దాం అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అనంతరం తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షుడు నేరెళ్ల తిరుమల గౌడ్, జన సమితి జిల్లా అధ్యక్షుడు బొజ్జ కనకయ్య, బుస్స ధశరథం, పంజాల వెంకటేశ్వర్ గౌడ్, నూగూరి ప్రకాశం, సత్యనారాయణ, రమేశ్, సకినాల అమర్, నామాల పోశెట్టి, నగుబోతు రవీందర్, తడగొండ సత్తయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్ బింగి మహేష్, కాంగ్రెస్ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

రాజన్న సేవలో ప్రొఫెసర్ కోదండరాం

తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బుధవారం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో బి.శ్రీనివాస్, సూపరింటెండెంట్ అల్లి శంకర్, జేఏసీ నాయకుడు నేరెళ్ల తిరుమల్ గౌడ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ప్రజల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్

వేములవాడ, జనవరి 17: ప్రజల రక్షణ, నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీలో బుధవారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత నేరాల నియంత్రణ కోసం ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రమం తప్పకుండా కమ్యూనిటీ కాంటాక్ట్ పేరిట సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల రక్షణ పోలీస్ శాఖ బాధ్యతని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకొని ఉంటే పోలీసులకు సమాచారం అందించడం ద్వారా నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని, యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతీ వాహనదారుడు వాహనాలకు నంబరు ప్లేట్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మొబైల్ ఫోన్‌లకు వచ్చే లింక్స్ ఓపెన్ చేయకూడదని, ఓటీపీ ఎవరికీ చెప్పవద్దని అన్నారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు. గంజాయి, జూదం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి తాగినా, విక్రయించినా నేరమని అన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు. గ్రామాలలో స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని తెలిపారు. భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కరుణాకర్, కృష్ణకుమార్, కిరణ్ కుమార్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఉపాధ్యాయుల సమస్యలకు త్వరలో పరిష్కారం

- పీఆర్‌టీయూటీ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జనవరి 17: ఉపాధ్యాయుల సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని పీఆర్‌టీయూటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, టిపిసిసి అధికారప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఫిలింభవన్‌లో పీఆర్‌టీయూటీ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను కొత్తగా తయారు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు 57/4, 57/5 మెమోను అమలు చేయాలని, పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఎస్‌జీటీ, ఎస్‌ఏలకు వేతన వ్యత్యాసాలను తగ్గించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంచిరెడ్డి అనంత్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ ఉపాధ్యక్షులు కేతిరి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మక్కపేట శివారులో చిరుత పులుల సంచారం

ఇబ్రహీంపట్నం, జనవరి 18: మండలంలోని అమ్మక్కపేట గ్రామ శివారులోని వ్యవసాయ భూములలో, చెరుకు తోటలలో చిరుత పులుల సంచారం కలకలం రేపుతోంది. గ్రామ శివారులోని అటవీ ప్రాంతం వెంబడి, వ్యవసాయ తోటలలో రెండు రోజుల నుంచి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఓ రైతుకు చెందిన తోటల నుంచి పులులు వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులకు గ్రామస్థులు సమాచారం అందించారు. ఎఫ్ఆర్ఓ షౌకత్ అలీ అక్కడకు చేరుకుని చిరుత పులి పగ్ మార్కును(అడుగులు) పరిశీలించారు. అటవీ ప్రాంతంలో, పరిసర ప్రాంతంలో పూర్తి నిఘా పెడుతున్నట్లు షౌకత్ అలీ తెలిపారు. అనుమానిత ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత పది రోజుల క్రితమే పక్కన ఉన్న సత్యక్కపల్లె గ్రామంలో సంచరించిన పులి అమ్మక్కపేట గ్రామ శివారుకు వచ్చి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 17: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 39మంది రైతులు 422 క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,700, కనిష్ఠ ధర రూ.5,200 చెల్లించారు.

ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 17: ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన వృద్ధుడు గూడ రాజిరెడ్డి(90) కల్వర్టు పైనుంచి పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుపై కూర్చున్న రాజిరెడ్డి ప్రమాదవశాత్తు కింద పడడంతో గాయాలతో చనిపోయాడు. మృతుడి కొడుకు అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టుల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

» ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్తీకు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సొహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నట్టు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్. దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్నసాగర్ కడితే సరిపోయేది

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్తూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్టు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజీత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్జాగా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెంబర్ 66లో 2009-10 పహాణీ ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాలతోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఆర్‌డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబుచులాడుతుండగా మధ్యలో సందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల నియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్లు పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోనేలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!


(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

వేములవాడ, జనవరి 17 : ప్రమాదవశాత్తు మరణించిన గాయత్రి బ్యాంకు ఖాతాదారుడు నేతికుంట అనిల్ కుమార్‌కు ప్రమాద బీమా సౌకర్యం కింద మంజూరైన లక్ష రూపాయల చెక్కును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం వేములవాడలో మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. గాయత్రి బ్యాంక్ ఏజీఎం సీహెచ్ వంశీకృష్ణ, బ్రాంచ్ మేనేజర్ గజేంద్ర, అనిల్ కుమార్ తల్లి సత్తవ్వ ఉన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

చందుర్తి, జనవరి 17 : చందుర్తి మండలం మల్యాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం రాత్రి ముగిసింది. విన్నర్‌గా కోరుట్ల, రన్నర్‌గా ఊట్‌పల్లి జట్లు నిలిచాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య సర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ, టోర్నమెంట్ నిర్వాహకుడు ఈర్లపల్లి రాజు, నాయకులు ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మంత్రికి వినతి

సిరిసిల్ల రూరల్, జనవరి 17 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్‌లో ఏర్పాటు చేసిన 17వ పోలీస్ బెటాలియన్‌లో పోయిన తమ భూముల విషయమై న్యాయం చేయాలని బాధితులు కోరారు. బుధవారం కాంగ్రెస్ జిల్లా నాయకులు గంభీరావుపేట ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో భూములను కోల్పోయిన బాధితులు హైదరాబాద్‌కు వెళ్లి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. పరిహారంతోపాటు భూమికి బదులు భూములను ఇప్పించాలని వేడుకున్నారు.

సిరిసిల్ల టౌన్ సీఐగా బాధ్యతల స్వీకరణ

సిరిసిల్ల క్రైం, జనవరి 17: సిరిసిల్ల టౌన్ సీఐగా బొడకుంట్ల రఘుపతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. రఘుపతి సిరిసిల్ల డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడే పనిచేస్తున్న రఘుపతికి సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇవ్వడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సిరిసిల్ల టౌన్ ఎస్‌ఐలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అందరి సమన్వయంతో సిరిసిల్ల ప్రజలకు సేవలు అందిస్తామన్నారు.

పాలిస్టర్ పరిశ్రమ, సర్పంచులపై కేటీఆర్ మొసలి కన్నీరు

సిరిసిల్ల టౌన్, జనవరి 17:సిరిసిల్ల పాలిస్టర్ పరిశ్రమపైనా, సర్పంచులపైనా కేటీఆర్ మొసలి కన్నీరు కార్చడం దివాలకోరు రాజకీయమని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు వస్త్ర పరిశ్రమకు రావాల్సిన బిల్లులు ఇవ్వకుండా అధికారం పోగానే ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు ఇవ్వాలనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమేనని తెలిపారు. బతుకమ్మ చీరల బిల్లులు ఇవ్వకుండా వ్యాపారులను ఎన్నికల వాడుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే బిల్లులు చెల్లించాలని మొసలి కన్నీరు కారుస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలో ఉండగా సర్పంచులకు బిల్లులను ఇవ్వకుండా వారిపై కూడా మొసలి కన్నీరు కారుస్తున్నారని తెలిపారు. నాడు సర్పంచులు సమస్యలు చెపుకోవడం కోసం వెళ్తే సమయం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

కోనరావుపేట, జనవరి 17: గతంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా ఉల్లంఘించిన వ్యక్తిపై తహసీల్దార్ జయప్రకాశరావు రూ.50 వేల జరిమానా విధించారు. కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం.. నిమ్మపెల్లి పరిధిలోని గొల్లపల్లికి చెందిన చేకూట దేవయ్య గతంలో మూలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలి స్తుండగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ప్రవర్తన మార్చుకోక తిరిగి అదే పని చేస్తుండగా పోలీసులు కేసు నమోదు చేశారు. రూ.50 వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

చీకోడ్ ఎల్లమ్మ ఆలయం వద్ద దొంగల బీభత్సం

ముస్తాబాద్, జనవరి 17: మండలంలోని చీకోడ్‌లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. చీకోడ్ ఎల్లమ్మ ఆలయం తాళాలు పగుల గొట్టారు. హుండీలోని దాదాపు రూ.2వేలకు పైగా నగదు ఎత్తుకెళ్లారని గీత కార్మికులు పేర్కొన్నారు. పక్కనే ఉన్న కిరాణకొట్టులో వెయ్యి నగదు, సామగ్రి ఎత్తుకెళ్లారు. సమీపంలోని రాజక్కపేటలో గొర్రెల మంద నుంచి ఆరు గొర్రెలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. గీత కార్మికులకు సంబంధించి దాదాపు రూ.40 వేల విలువైన కల్లు లొట్లను ధ్వంసం చేశారు. ఇది ఆరంభం మాత్రమే అని గోడలపై రాయడంపై గీతకార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఠాణాలో ఫిర్యాదు చేయనున్నట్లు సంఘం అధ్యక్షుడు గున్నాల గణేశ్‌గౌడ్ తెలిపారు.

మంత్రి పొన్నం వ్యాఖ్యల వక్రీకరణ సరి కాదు

ఎల్లారెడ్డిపేట, జనవరి 17: మతాన్ని అడ్డు పెట్టుకొని బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తోందని, మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను కరీంనగర్ ఎంపీ సంజయ్, ఆ పార్టీ నేత అనిల్‌రెడ్డి వక్రీకరించడం సరి కాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. స్వప్రయోజనాల కోసం బీజేపీ శ్రీరాముడి పేరును వాడుకుంటోందని, కాంగ్రెస్‌లోనూ హిందువులు ఉన్నారని అన్నారు. తమ పార్టీ నాయకులను బెదిరిస్తే ఊరుకోబోమని, ప్రజల మధ్య గుణపాఠం తప్పదని నర్సయ్య హెచ్చరించారు. నాయకులు లక్ష్మారెడ్డి, సాహెబ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రం, మల్లారెడ్డి, రాజయ్య బాబు, బుచ్చాగౌడ్, దేవయ్య, రాజేందర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలను కించపర్చిన మంత్రి

ఎల్లారెడ్డిపేట, జనవరి 17: అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రేషన్ బియ్యమని పేర్కొంటూ హిందువుల మనోభావాలను కించ పర్చారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నేవూరి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి స్థాయిని మర్చిపోయి మాట్లాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. శ్రీరాముడు, రామభక్తులను కించపరిచేలా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మహిళ రిమాండ్

వేములవాడ రూరల్, జనవరి 17: కులం పేరుతో దూషించి దాడి చేసిన మహిళను రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వారం రోజుల కిందట పత్తి వేరేందుకుమల్లారం గ్రామానికి చెందిన వజ్రవ్వ, జోగాపూర్ గ్రామానికి చెందిన సునిత జయవరం శివారులో పొలానికి వెళ్లారు. మునుముల విషయంలో జరిగిన వాగ్వాదంలో వజ్రవ్వను సునిత కులం పేరుతో దూషించి కర్రతో దాడి చేసింది. ఈ క్రమంలో వజ్రవ్వకు ఎడమచేతికి తీవ్ర గాయమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం బుధవారం రిమాండ్‌కు తరలించారు.

వైభవం.. రామలింగేశ్వరుడి రథోత్సవం


రథం లాగుతున్న భక్తులు


స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

ఇల్లంతకుంట, జనవరి 17: రామలింగేశ్వరుడి రథోత్సవం వైభవంగా సాగింది. జంగమరెడ్డిపల్లె గ్రామంలోని రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. రథాన్ని లాగడానికి యువకులు పోటీపడ్డారు. ఉత్సవ మూర్తులను రథంపై ఉంచగా దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. తలపై గండదీపం పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ టికెట్ ధరలను పెంచడంతో సామాన్య భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాటు చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సేవాలో పాల్గొన్నారు.

స్వామివారలను దర్శించుకున్న ప్రముఖులు

రామలింగేశ్వరస్వామి రథోత్సవంలో భాగంగా స్వామివారలను ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, ఆరెపల్లి మోహన్, జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి,ఏఎంసీ చైర్మన్ సంజీవ్, సర్పంచ్ తూముకుంట శ్రీలత నరేందర్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఎఫ్‌బీఐ అధ్యక్షుడు తూముకుంట రాజేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జనవరి 17: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం కొలనూరు, మర్తన్నపేట, ధర్మారం గ్రామాల్లో బుధవారం రాత్రి కృతజ్ఞతా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మర్తనపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం మొదటిసారిగా గ్రామాలకు వచ్చిన నేపథ్యంలో ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను గెలిపించిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని, ప్రజలు తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు. ఆరు గ్యారెంటీల్లో రెండు అమలు చేశామని మిగతా సంక్షేమ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, మర్తనపేట సర్పంచ్ వంశీరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, తాళ్లపల్లి ప్రభాకర్, గొట్టే రుక్మిణి, అబ్దుల్ రషీద్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం

వేములవాడ రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. చెక్కపల్లి, నూకలమర్రి, అచ్చన్నపల్లి గ్రామాల్లో బుధవారం కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను వందరోజుల్లో అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ రాములు, రంగు వెంకటేశం, ఎదురుగట్ల సర్పంచ్ సోయినేని కరుణాకర్, పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

వేములవాడ, జనవరి 17: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తరఫున కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ (టీఎస్‌టీటీఎఫ్) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘం నాయకులు పలు అంశాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు భూక్య హాజు నాయక్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా మదన్ లాల్, నాయకులు బాలు నాయక్, లాక్య నాయక్, రాజు నాయక్ పాల్గొన్నారు.

యువతతోనే దేశ భవిష్యత్

ఎల్లారెడ్డిపేట, జనవరి 17: యువతతోనే దేశ భవిష్యత్ ఆధార పడి ఉందని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి చింతల మోహన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా డీఐఈవో మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా సన్మార్గంలో పయనించాలన్నారు. విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలన్నారు. సర్పంచ్ శంకర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పర్శరాములు, పంచాయతి కార్యదర్శి రవి, వీపీవో రవీందర్, అధ్యాపకులు సాగర్, చంద్రమౌళి, భూమక్క, కవిత పాల్గొన్నారు.

రెండు రోజుల్లో మల్లన్న సాగర్ నీటి విడుదల

ముస్తాబాద్, జవరివరి 17: రెండు రోజుల్లో మల్లన్న సాగర్‌లోని నీటిని ఎగువమానేరుకు విడుదల చేస్తారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఆయకట్టు రైతులకు సాగు నీరుందించేందుకు మల్లన్నసాగర్ నీటిని ఎగువ మానేరులోకి విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరగా వెంటనే స్పందించి ఇరిగేషన్ ఈఎన్‌సీకి ఫోన్ చేశారు. రెండు రోజుల్లో నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. రంగనాయకసాగర్ నీటితో ముస్తాబాద్, తంగళ్లపెల్లి మండలాల్లోని పరిధిలోని చెరువులను, కెనాల ద్వారా నింపి సాగు నీటికి, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరగా స్పందించారని మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ముస్తాబాద్, జనవరి 17 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, కష్టపడితే విజయాలు వరిస్తాయని మండలంలోని బందనకల్ సర్పంచ్ గుర్రపు వెంకటేశ్వరి అన్నారు. మండలంలోని బందనకల్‌లో గుర్రపు నారాగౌడ్ స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలుగా బందనకల్ జట్టు, ముస్తాబాద్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఉపసర్పంచ్ కార్తీక్‌గౌడ్, గుర్రపు నరేశ్, ప్రవీన్, సద్దాం ,చిగురు మహేందర్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసంపై కార్యవర్గ సమావేశం వాయిదా

చందుర్తి, జనవరి 17: చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్‌పై సంఘం పాలకవర్గ సభ్యులు డిసెంబరు 23న జిల్లా సహకార అధికారికి అవిశ్వాస ప్రతిపాదనను అందజేశారు. బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవిశ్వాసంపై కార్యవర్గ సమావేశం ఉండగా వాయిదా వేశారు. తిరిగి ఈనెల 29న కార్యవర్గ సమావేశానికి హాజరు కావాలని జిల్లా సహకార అధికారి నోటీసులో పేర్కొన్నారు.

ప్రజాసంఘాల నాయకులపై కేసులు ఎత్తివేయాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 17 : పోడు భూముల పోరాటాల్లో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులపై పోలీసులు పెట్టిన కేసులను ఎత్తివేయాలని ప్రజా సంఘాల ప్రతినిధి మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో మాట్లాడారు. పోడు భూముల పోరాటంలో కేసులు నమోదైనవారు జిల్లా కేంద్రంలోని కోర్టు చుట్టూ తిరుగుతున్నారన్నారు. 50 సంవత్సరాల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే హక్కు పత్రాలను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు ఈసంపల్లి కొమురయ్య, జింకపోచయ్య, జూలపల్లి మనోజ్, గజ్జుల ప్రశాంత్, గుర్రపు నరేష్, రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

డబ్బు తీసుకొని మోసం చేశాడంటూ ఆత్మహత్యాయత్నం

వేములవాడ జనవరి 17: డబ్బు తీసుకొని మోసం చేశాడంటూ ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించిన సంఘటన బుధవారం వేములవాడలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సుభాశ్ నగర్‌కు చెందిన వెంకటేశం వద్ద వేములవాడ పట్టణానికి చెందిన గంప మారుతి అనే వ్యాపారవేత్త సిరిసిల్ల పట్టణంలోని ఓ బార్‌లో వాటా ఇస్తానని సుమారు రూ.కోటి వరకు నగదు తీసుకున్నాడు. వాటా ఇవ్వకపోగా, డబ్బులు కూడా తిరిగి ఇవ్వకుండా చెల్లని చెక్కులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ వెంకటేశం భార్య, కూతురుతో కలిసి గంప మారుతికి చెందిన సినిమా థియేటర్ వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు.స్థానికులు గమనించి వారించడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

ఎస్సై పేరుతో డబ్బులు వసూలు.. ఒకరి రిమాండ్

సిరిసిల్ల క్రైం, జనవరి 17: ఎస్సై పేరు చెప్పి రూ.13 వేలు వసూలు చేసిన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన అక్కపల్లి ఎల్లారెడ్డిని రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. బుధవారం సిరిసిల్లలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 12న వే బిల్లులు చూపెట్టని మూడు ఇసుక ట్రాక్టర్‌లను తంగళ్లపల్లి పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారని, అందులోని ఓ ట్రాక్టర్ యజమాని వెంకట రమణకు ఎల్లారెడ్డి ఫోన్ చేసి తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నానని, ఎస్సైతో మాట్లాడి ట్రాక్టర్ తీసుకొస్తానని చెప్పి బెదిరించి రూ. 13వేలు తీసుకొని సొంతానికి వాడుకున్నాడని అన్నారు. వెంకటరమణ ఫిర్యాదుతోఎల్లారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ వ్యవహారంలో మరికొంత మందిపై విచారణ చేపట్టామన్నారు. ఎవరైనా డబ్బుల వసూళ్లకు పాల్పడి సమాచారం ఇవ్వాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పారిశుధ్య సిబ్బందికి నిత్యావసరాల పంపిణీ

గంభీరావుపేట, జనవరి 17: గంభీరావుపేట మండల కేంద్రంలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు పారిశుధ్య సిబ్బందికి బుధవారం నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా వారు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మల్లన్నసాగర్ నీటిని విడుదల చేయాలి


ఎగువ మానేరును సందర్శించిన బీజేపీ నేతలు

గంభీరావుపేట, జనవరి 17: మల్లన్న సాగర్ నుంచి కూడవెళ్లి వాగు ద్వారా ఎగువ మానేరు ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయాన్ని బుధవారం పరిశీలించారు. మానేరు సామర్థ్యం 3 టీఎంసీలు ఉండగా, గత పాలకుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం 1 టీఎంసీకి చేరిందన్నారు. మానేరు ఆయకట్టుకు సరిపడా నీరు ప్రాజెక్టులో లేదని, ఆయకట్టు రైతుల పంటలు ఎండి పోయే పరిస్థితి ఉందని అన్నారు. గత ప్రభుత్వం 9వ ప్యాకేజీ ద్వారా మానేరులోకి నీరు తెచ్చి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. అందుకే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని మల్లన్నసాగర్ నుంచి మానేరులోకి నీటిని విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, యువ మోర్చ మండల అధ్యక్షుడు విగ్నేష్ గౌడ్, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు పత్తి స్వామిరాజు, రాజుగౌడ్, నాగరాజు గౌడ్, ఎల్లం, మల్లేష్‌యాదవ్, స్వామి తదితరులు ఉన్నారు.

'తప్పుడు సంకేతాలు ఇస్తే ఊరుకోం'

సిరిసిల్ల టౌన్, జనవరి 17 : సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా గాజుల నారాయణ తొలగింపుపై కోర్టు ఈ నెల 24 వరకు స్టే ఇచ్చిందని, తప్పుడు సంకేతాలు ఇస్తే ఊరుకోబోమని మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల రాములు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా మొన్నటి వరకు కొనసాగిన గాజుల నారాయణకు ముగ్గురు పిల్లలు ఉన్నారనే ఫిర్యాదుపై కలెక్టర్, డీసీవో విచారణలో రుజువైందన్నారు. కో ఆపరేట్ యాక్ట్ ప్రకారం అధికారులు సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ గాజుల నారాయణను బ్యాంక్ డైరెక్టర్‌గా డిస్‌క్వాలీఫై చేశారన్నారు. మరుసటి రోజు బ్యాంక్ డైరెక్టర్లు కొత్త చైర్మన్‌గా గడ్డం విఠల్‌ను ఎన్నుకున్నారన్నారు. మాజీ చైర్మన్ గాజుల నారాయణ బ్యాంక్ డైరెక్టర్‌గా డిస్‌క్వాలీఫైపై కోర్టుకు వెళ్లారని తెలిపారు. కోర్టు ఈ నెల 24వరకు స్టే ఇచ్చింది తప్పా బ్యాంక్ చైర్మన్‌గా ఉండవచ్చని ఎక్కడా చెప్పలేదన్నారు. ఈ నెల 24 వరకు నీ పదవి ఉంటదో ఊడుతుందో కోర్టులోనే తేల్చుకోవాలని, తప్పుడు సంకేతాలు ఇస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కో ఆపరేట్ యాక్ట్ ప్రకారం బ్యాంక్ డైరెక్టర్‌గా పోటీ చేసే వారికి ముగ్గురు పిల్లలు ఉండకూడదన్నారు. బ్యాంక్‌లో వారికి సంబంధించిన బంధువులు ఉద్యోగులై ఉండకూడదన్న నిబంధనలను పాటించాలన్నారు. తప్పుడు అఫిడవిట్ ఇస్తే కో ఆపరేట్ యాక్ట్ చట్టాన్ని మోసం చేసినట్లేనన్నారు. సిరిసిల్ల అర్బన్ బ్యాంక్‌లో కూడా కుంభకోణాలు జరిగాయని, బ్యాంక్ డబ్బులను సీఈవో సహకారంతో వాడుకుంటున్నారని ఆరోపించారు. బ్యాంక్‌కు సంబంధించిన ప్రతీ రూపాయి కట్టిస్తామని బ్యాంక్‌ను ప్రజలు కాపాడుకుంటారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ జిల్లా అధ్యక్షుడు కంసాల మల్లేశం పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో బ్లూ కోల్ట్స్ పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 17: నేరాల నియంత్రణలో బ్లూ కోల్ట్స్ పాత్ర కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందికి ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలో డయల్-100కాల్స్‌కి త్వరితగతిన స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. డయల్ 100కాల్ చేయగానే పోలీసులు వచ్చి సమస్య పరిష్కరిస్తారని, ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలన్నారు. నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నిఘా ఉంచాలన్నారు. సస్పెక్ట్, రౌడీ, కేడీ, డీసీలను విధిగా చెక్ చేయాలన్నారు. ప్రాపర్టీ సంబంధిత నేరాల నియంత్రణలో బ్లూ కోల్ట్స్, పెట్రోకార్స్ అధికారుల కృషి ఎంతో ఉందన్నారు. ప్రజల పట్ల బాధ్యతగా మెలగాలని, అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. విసిబుల్ పోలిసింగ్‌లో భాగంగా అత్యవసర సేవలైన రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, పట్టణాలు, గ్రామాలలో జరిగే అవాంఛనీయ సంఘటనలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, తదితర వాటికి సంబంధించిన డయల్ 100 కాల్ ద్వారా సమాచారం అందిన వెంటనే ఆ ప్రాంతంలో అందుబాటులో ఉన్న బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వర్టిక్ డీఎస్పీ రవీందర్, వేములవాడ టౌన్ సిఐ కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలోనే పరిశ్రమలను తిరిగి ప్రారంభిస్తాం


సమావేశమైన పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్ల రూరల్, జనవరి 17: బంద్‌తో పేరుకుపోయిన నిల్వలకు మార్కెటింగ్ వచ్చి వస్త్రాన్ని అమ్ముకుంటున్నామని, త్వరలోనే పూర్తి వస్త్రాన్ని అమ్ముకొని పరిశ్రమలను తిరిగి ప్రారంభిస్తామని సిరిసిల్ల పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మండల సత్యం, యెల్దండి దేవదాస్ తెలిపారు. సిరిసిల్ల పాలిస్టర్ వస్త్రోత్పత్తి దారుల భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పాలిస్టర్ వస్త్ర పరిశ్రమల్లో తయారు చేసిన వస్త్రాలు అమ్ముడుపోక నిల్వలు పెరిగిపోయాయని, వాటిని అమ్ముకునే వరకు వస్త్ర పరిశ్రమను బంద్ ఉంటుందని అన్నారు. వస్త్ర పరిశ్రమ మాంద్యంగా ఉన్నందున సిరిసిల్లలో ఉత్పత్తి అయ్యే పాలిస్టర్ బట్టకు మార్కెట్‌లో డిమాండ్ లేనందున పరిశ్రమల్లో తయారు చేసిన ఉత్పత్తులు పేరుకుపోయాయని, సంఘం సభ్యుల సూచనల మేరకు సొంతంగానే పాలిస్టర్ వస్త్ర పరిశ్రమల బంద్‌కు పిలుపునిచ్చామని అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పాలిస్టర్ వస్త్రాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వస్త్ర పరిశ్రమలకు ఆర్డర్లు ఇవ్వడానికి సుముఖంగా ఉందని, చేనేత జౌళి శాఖ నుంచి ఆర్వీఎం ఆర్డర్లను ఏడీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి పోరండ్ల మల్లేశం, కోశాధికారి శ్రీరాం సత్యం, ఉపాధ్యక్షులు బూట్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లకు అర్హులను ఎంపిక చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గంభీరావుపేట, జనవరి 17: పంపిణీ చేసిన డబుల్ బెడ్ ఇళ్ల అవకతవకలపై రీ సర్వే చేయాలని, అదే విధంగా మిగిలిన ఇళ్ల పంపిణీలో అర్హులను ఎంపిక చేయాలని తెలంగాణ బహుల జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సిద్ధిరాములు డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ సమీపాన డబుల్ బెడ్ రూం ఇళ్ల దరఖాస్తుదారులతో సిద్ధిరాములు, మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్ బుధవారం సమావేశమయ్యారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు, పలు సమస్యలు, ప్రస్తుత పరిస్థితితులపై వివరాలు సేకరించారు. అర్హులకు న్యాయం జరుగుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్ధిరాములు మాట్లాడుతూ ఈ నెల 25లోగా మిగిలిన ఇళ్లను అర్హులకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పంపిణీ చేసిన ఇళ్లకు సంబంధించి అనర్హులను గుర్తించాలన్నారు. ఇతర గ్రామాల్లో ఉంటున్న వారికి ఇక్కడ ఇళ్లు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయని, తక్షణమే వారిని గుర్తించాలన్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా.. అర్హులకు అన్యాయం జరిగినా.. ఈ నెల 27 నుంచి ప్రత్యక్ష పోరాటం చేపడుతామన్నారు. అనంతరం తహసీల్దార్ భూపతికి వినతి పత్రం అందజేశారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల సాధన కమిటీ

గంభీరావుపేటలో డబుల్ బెడ్ రూం ఇండ్ల సాధన కమిటీని ఏర్పాటు చేశారు. 19 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీకి కన్వీనర్‌గా ముద్రకోల అంజనేయులును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సోని, సయదా, పారహన్, బాగ్యలక్ష్మి, రేణ, గౌసియా, ఎల్లవ్వ, సౌందర్య, ప్రవీన్, శ్రీనివాస్, నజీర్, మహేష్, నాగయ్య, సయ్యద్, సాహితీ, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.